

# జగన్నాథస్వామి రథచక్రాలు

మొన్న శనివారం మాఆవిడ బందరు వెళ్ళినప్పుడు రైలులో ఒకావిడ తనజీవితం యీ క్రిందివిధంగా చెప్పుకుందట,

"మీరే చెప్పండి అక్కగారూ, తప్పునాదేమో! చూస్తూచూస్తూ పిల్లను అవాజమ్మచేతిలో ఎలా పెట్టమన్నారు? ఆవెర్రి వెంగళాయ దీన్ని ఏంసుఖ పెడతాడని వాడికిచ్చి పెండ్లిచెయ్యను అలా చేయక పోయినందుకుగాను నాకీ శిక్ష? పోనీ నాతో సరిపుచ్చుకుని ఊరుకోక ఏపాపం ఎరగని నాపిల్లని హింసపెట్టాలా? ఎవరిదితప్పో విచారించి వారిని కూకవేయవలసిన పెద్దలు, సంఘనాయకులు వాళ్లకూడా నామీదా నాపిల్లమీదా కత్తికట్టాలా?

"అసలు మీకు మొదటినుంచీ జరిగినది చెపుతేకాని విషయం అవగాహన కాదు చెపుతా, కాస్త ఓపికపట్టి వినండి

"మాది బెజవాడదగ్గర గుణదల మానాన్న ఆవూళ్లో రాణేదారు. మా తలితండ్రులకి నేను, మాఅన్నయ్య. యిద్దరమే పిల్లలము వాళ్లమమ్మల్ని యిద్దర్నీ అల్లారుముద్దుగా పెంచుకువచ్చారు. మా అన్నయ్యకీ నాకూ నాలుగేళ్లతేడా, మాఅన్నయ్య స్కూలుఫైనలు చదువుతూ చదువుతూ హఠాత్తుగా టైఫాయిడ్ జ్వరంవచ్చిచచ్చిపోయాడు అన్నయ్య చచ్చిపోయిన రెండేళ్ళకి బెజవాడలో హైకోర్టు వకీలుగా ఉన్న కలిదిండి రామారావుగారి పెద్దబ్బాయికి మావాళ్ళు నన్నిచ్చి పెళ్ళిచేశారు, నాపెళ్లికి కట్నంక్రింద, కానుకల క్రింద, పెండ్లి ఖర్చుక్రింద చాలా అప్పయిపోయిందని మావాళ్లు అనుకునేవారు. ఆ అప్పులక్రిందనే కాబోలు మానాన్న పిత్రార్జితపొలం యావత్తూ మరుచటి సంవత్సరమే అమ్మివేశాడు. నాపెళ్ళినాటికి మావారు బి యల్ చదువుతుండేవారు పెళ్ళి వేసగిలో వారు బి. యల్ ప్యాసుకావడం నన్ను కాపరానికి తీసుకువెళ్ళడం రెండూ ఓసారే జరిగాయి గవర్నమెంటు ఉద్యోగానికి వెళ్ళమని మేనమామ ప్రోత్సహించినా వినక తండ్రితో జాయింటుగ మావారు ప్లీడరు ప్రాక్టీసులో ప్రవేశించారు మామామగారు మంచిముసద్దీ అనిపేరు వారు వ్రాసినవి పెద్దపెద్ద జడ్జీలే మెచ్చుకోవటం కద్దట తండ్రిగారి తరిపీజువల్లనో, లేకపోతే స్వప్రయోజకత్వం చేతనో మావారు వ్యాజ్యాలు నడిపించడం ఆరిందాలయ్యారు. సంసారం పెద్దదైనా యింటిఖర్చు విశేషమైనా తండ్రీ కొడుకులు ఉభయ సంపాదనలమీదా ఎవ్వరికీ ఏలోటూ

రచన : అవసరాల వెంకటనర్సు, బి. ఎ. బి. యల్.

లేకుండా జరిగిపోతూ ఉండెది. ఉభయులూ కలసి నెలకి ఏపదిహేను వందలో తెచ్చేవారని ప్రతీతి.

"నే కాపరానికి వెళ్ళిన క్రొత్తలో నాతో మా వారు ఎక్కువ యిష్టంగా ఉండేవారు. ఊరిలో బంగారపు దుకాణాలకి ఏక్రొత్త నగవచ్చినా బట్టల షాపుల్లోకి ఏక్రొత్త అద్దకాలొచ్చినా, అన్నీ తెచ్చి ఇంట్లో పడేస్తూఉండేవారు ఆయన తేనక్కర లేకుండానే దుకాణపువాళ్లు యింటికి సరుకుతెచ్చి పడేస్తూ ఉండేవారు. ఇంట్లో వంటబ్రాహ్మడుండే వాడు. మా అత్తగారు యింటికి కావలసిన సరఫరా అంతా చూసుకునేవారు ప్రొద్దున్నా—సాయంత్రం—ప్రొద్దున్నది సాయంత్రం కాకుండా సాయంత్రంది ప్రొద్దున్న కాకుండా—ముస్తాబై మావారికి వేళ దొరికినప్పుడల్లా వారిని విడువకుండా సినిమాలకో. కారుషికారులకో. స్నేహితుల యిళ్ళల్లో విందులకో వెడుతూ ఉండడము అప్పటి నా దినచర్య. ఆ రోజులలో కాస్త నా జుట్టు రేగినా, జడపువ్వు వాడినా, చీర మెరపుతగ్గినా మావారికి కంటకంగా ఉండేది.

"ఆ రోజుల్లో మా ఆయన నాకెన్నో క్రొత్త విషయాలు చెపుతుండేవారు. ఆయనబాగా చదువుకున్నవారు; చాలా విషయాలు తెలిసినవారు, పట్నవాసస్థులు; నేను పల్లెటూరిదాన్ని; విద్యాగంధం ఎరగనిదాన్ని—అందుచేత అన్నిటిలోను ఆయన చెప్పినదే నాకు సబవు అనిపిస్తూఉండేది నాకు అట్టే స్వంత ఊహలుకాని స్వతంత్రంగా ఆలోచించేశక్తికాని లేకపోయేవి. ఆయన చెప్పిందల్లా మహబాగంటూ కొన్ని ఏళ్లు గడిపేను.

"స్వతస్సిద్ధంగానాది ఎదుటివాళ్లు ఔనంటేఔననీ కాదంటే కాదనీ స్వభావంకాదు నాచిన్నతోనూ తనంలోకూడా నేను మా అమ్మతోనూ నాన్న చాలాసార్లు వాదం పెట్టుకునేదాన్ని కాని భర్త గారింటికి కాపురానికి వచ్చినతరువాత ఏకారణం చేతనో నేను కేవలం సాధువను అయిపోయాను. మామామగారు ముక్కోపి. ఆయన్ని ఎదిరించి ఎవరైనా మాట్లాడితే వాళ్ళమీద ఆయన దూర్వాసుడిలా విరుచుకు పడేవాడు ఆయనముందు మాఆయన చాలా శాంతమూర్తే. కాని మావారికి కూడా పట్టుదలజాస్తీ ఆయన పట్టిన కుందేటికి మనంకూడా మూడేకాళ్ళని ఒప్పుకుంటేనే మనం ఆయనతో నెగ్గుకురాగలం నాలుగోకాలు ఊసెత్తితే ఎటుంచి ఎటువస్తుందో చెప్పలేము

"నేను కాపరానికి వచ్చిన రెండేళ్లకి మాపెద్ద ఆడబడుచు సావిత్రికి పెళ్ళయింది పెళ్లయినకొద్ది రోజులలో ఆవిడ కాపరానికి వెళ్లిపోయింది. మరుచటి ఏడాది ఆవిడికో కొడుకు పుట్టాడు

"ఆవెనక నాలుగేళ్ళకి నాకోకూతురు పుట్టింది. మళ్లీ నాకు సంతానం కలుగలేదు

"ఒక్కగా నొక కూతుర్ని మేం భార్యాభర్తలం ఉభయులం ఎంతముద్దుగా పెంచామో మీకు చెప్పేదేమిటి? మా ఒకత్తేపిల్ల కావడమే కాకుండా మాశోభ—మా మరుదలకు పిల్లలు పుట్టేదాకా—యింటంతకీ ఒక్కర్తే పిల్ల బామ్మకి అదంటే ముద్దు, తాతగారికి అదంటే పంచప్రాణాలూను, ఇంతమంది గారాం చేసిన పిల్లకి మంకుతనం అబ్బకుండా ఉంటుందా?

"అతి గారాబంగా పెరిగిన పిల్లలకి ఒంటెత్తుతనం, అపరిమితమైన పట్టుదల, యింకొకరితో కలియలేక పోవడం,—యీలాంటి దుర్గుణాలు అబ్బినట్టుగానే ఆత్మవిశ్వాసం, ధైర్యం, సాంప్రదాయాన్ని అతిక్రమించే సాహసం, యివికూడా అలవడుతాయి అనుకుంటాను. మంచైనా చెడుగైనా పదిమందితో కలసిపోయే వాళ్లే జీవితంలో కొంతసుఖం ఉంటుంది, శాంతి ఉంటుంది. తోటి వాళ్ళకు దూరమై సన్మార్గ ప్రవర్తకులైన ముప్పే, వాళ్ళకృషి సం స్మత్వానికి తోడ్పడవచ్చును కాని వాళ్ళకి మాత్రం కడగండ్లు తప్పవు.

"మా ఆయన శోభకోసం ప్రత్యేకించి మాస్టర్లని పెట్టించారు. ఇంగ్లీషుకో మాస్టరు, తెలుగుకి ఓమాస్టరు, సంస్కృతానికి ఓమాస్టరు, మాఊళ్లో స్కూళ్ళేవీ ఆయనకు నచ్చలేదు. మంచివాళ్ళనే ఏరిపెట్టారు కాని, స్కూలుకో నలుగురుపిల్లల తోటి చదువుకునే టప్పుడుండే ఉత్సాహము, సరదా, ప్రక్కవాళ్ళను మించుదామనే జిగీష—యివి ప్రయివేటు మాస్టర్లదగ్గర చదువుకున్న పిల్లకి ఎలా వస్తాయి?

"నే పోరగా పోరగా. శోభకి సంగీతంకూడా వారు చెప్పించారు, ఇందులోమాత్రం నేను నా ఉద్దేశాల ప్రకారం జరిపించుకున్నా. హార్మోని పెట్టె మాయింటికి ఆమడదూరంలోకి రాకూడదన్నా. కలకత్తాలో పెద్ద కంపెనీకివ్రాయించి ఒకటో రకమైన ఫిడేలు తెప్పించా. ఫిడేలు, గాత్రం యివిరెండూ అమ్మాయికి నేర్పించాలన్నా. ఇవి చెప్పడానికి ప్రత్యేకించి తిరుచునాపల్లి వ్రాయించి ఆచవ విద్వాంసుడ్ని పిలిపించా. అతనిదగ్గర మా అమ్మాయి ఆరేళ్లు సంగీతం నేర్చుకుంది. ఈ కాలంలో 'మూడునెలల్లో మా అమ్మాయికి ఫిడేలు నేర్పించాము' అనీ నాలుగుమాసాలలో మాపిల్ల త్యాగరాయ కృతులన్నీ నేర్చేసుకుంది' అనీ చెప్పే తల్లుల్నిచూస్తే నాకు నవ్వు వస్తుంది. వీరి దృష్టిలో సంగీతం ఎంత చులకనైన వస్తువు!

"శోభ పుట్టిన దగ్గరనుంచీ దాన్ని మా ఆడబడుచు సావిత్రిగారి అబ్బాయికే మాత్తమామలు స్థిరంచేశారు. మాఆయన మనస్సూ అటే మొగ్గుతుండేది. నాకుమాత్రం యీ సంబంధమంటే మొదటినుంచీ యిష్టముండేది కాదు శోభకి 9, 10,11 యీ విధంగా వయస్సు వస్తూన్నకొద్దీ మునలివాళ్ళ బలం హెచ్చుతూ వుండేది. మొదటిలోనే దీనిని అరికడితేబాగుండుననినేననేకసారులు అనుకుంటూ వచ్చాకాని నాకేధైర్యం చాలేదికాదు చివరికి శోభకి పన్నిండేళ్లు నిండాయి. ఇహ ఆలస్యంచేస్తే పిల్ల పెద్దమనిషి అవుతుందనీ తమకి పుట్టగతు లుండవనీ పెద్దవాళ్లు తొందరచేయడం మొదలుపెట్టారు. సావిత్రికూడా ముహూర్త నిశ్చయం చేయమని కబుర్లమీద కబుర్లు పంపడం మొదలువెట్టింది అన్నీసిద్ధమైఅమ్మాయికి మూడు ముళ్లూ పడడం తరువాయి, అన్న సందర్భం వచ్చింది. ఇహ మాఆయనతో నా మనస్సులో మాట చెప్పక తప్పిందికాదు.

ఇంతకీ సావిత్రి కొడుకులోవున్న లోపమేమిటి? అని మీరడుగుతారేమో, చెపుతా వినండి.

"సావిత్రి మామగారు రేపల్లె తాలూకాలో పేరు పొందిన కరణం. ఆప్రాంతాలలో వెంకట్రామయ్యగారి పేరు చెపితే బీదలూ, భాగ్యవంతులూ కమ్మలూ, కాపులూ యావన్మందీ హడలుతూ ఉంటారు ఆయనతో విరోధం పెట్టుకున్నవాళ్లు ఎందరో నేలమట్టమయారు. ఆయన చాణుక్యుడి తరువాత మళ్లీ చాణుక్యు డంతటివాడు. మీరు నమ్ముతారో నమ్మరో ఆ ప్రాంతాలకు వచ్చిన తహసీల్దార్లూ డిప్టీకలెక్టర్లు కూడా వెంకట్రామయ్యగారికి జడుస్తూ ఉంటారు. సావిత్రమ్మ మొగుడు వెంకట్రామయ్యగారి యేకైక పుత్రుడు ఈయనకి చదువూ అబ్బలేదు, వ్యవహారజ్ఞానమూ కలుగలేదు. వెంకట్రామయ్యగారి కుమారుడై పుట్టటం తప్పితే ఆయన్లో మంచిగుణం ఒక్కటిలేదు. మా మామగారు వెంకట్రామయ్యగారి ఆస్తిని చూసి అబ్బాయి మంచిచెడ్డలు సరిగా విచారింపక అమ్మాయిని యిచ్చేశారు, ఆమొగుడితో కాపురం చెయ్యలేక సావిత్రమ్మే అఘోరిస్తూ ఉండేది. సావిత్రమ్మకి ఓ కొడుకూ ఓ కూతురూను—కూతురు యింకా కాస్త నయంకొని కొడుకు

మూడుమూర్తులా తండ్రే. తండ్రిగారు పండిత పుత్రుడైతే కొడుకు పండితపౌత్రుడు కుంరలలో కుంర అంటే మీరు నమ్మండి

"కానైతే వెంట్రామయ్యగారు సంపాదించిన నూటయాభై యకరాల పొలం చెరువుదరిని నిత్య కళ్యాణం పచ్చతోరణంలా ఉంది. వర్షాలు కురవ నివ్వండి, అఖరికి గోదావరీ కృష్ణా నదులలో ఒక్క నీటిబిందువుకూడాలేని అరిష్టంసంభవించినా ఆపొలం పండితీరుతుంది. అదే కాకుండా సావిత్రమ్మకి ఎలాగేనా అన్నగారితో సంబంధం చేద్దామని ఉంది మాశోభ అంటే చిన్నప్పటినుంచీ ఆవిడకి పక్షపాతం. శోభవాళ్లింటి కోడలైతే వాళ్ల అబ్బాయిలో యేలాంటి మార్పైనారావచ్చునని ఆవిడ నమ్మకం· "కుర్రవాడికి పద్దెనిమిదేళ్లు పూర్తిగా నిండలేదు. ముందింకా ఎంతబ్రతుకు లేదూ· కొన్నాళ్లు మన్నులాపడుండి తరువాత తేరుకున్నవాళ్లు లేరూ? ఒక్కొక్కళ్ల తెలివి తేటలు ఆలస్యంగా బైటకొస్తాయి. పెళ్లాం కావరానికొచ్చి నలుగురు బిడ్డల తండ్రి అయితే తాతగారిలా వాడూ పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తాడేమో. తాతగారి పేరు ఊరికేపోతుందీ?" అని మా అత్తగారనేవారు "కావలసిన సంబంధము, ఎంతమందితిన్నా తరగని ఆస్తి. అన్నీ సరిదిద్దుకోడానికి తాతగారు బ్రతికున్నాడాయెను. యింకా వెనకాముందూ చూడడమేమిటి?" అని మామామ అరనేవారు, 'పోనీ మొగుడంత అప్రయోజకుడైతే ఉభయులకీ సరిపడ్డ తెలివితేటలు మనపిల్లలోనే ఉన్నాయి. ఇప్పుడు మహాతెలివైనా వాళ్లూ చదువుకున్నవాళ్లూ మాత్రం పొడిచేసినదేముంది? సంఘాన్ని ఉద్ధరిస్తామనీ దేశాన్ని ఉద్ధరిస్తామని అక్కరమాలిన బెడదలకి దిగి పెళ్లాం బిడ్డల్ని యేడిపించడమేగా? అని మావారనేవారు.

"శోభకి యీ అబ్బాయి పేరుచెపితే అసహ్యం దానిని అడిగి చూడండి' అని నేను మావారితో ఎన్నోసార్లు చెప్పిచూశా. 'దాని బాగోగులు చూడవలసిన వాళ్ళం మనం కాని దానికేంతెలుస్తుంది?' అని ఆయన ఎప్పటికప్పుడే తోసేసేవారు.

"చివరికి యీ బరువంతా నానెత్తిని వేసుకుని నేను మా ఆయనతో పోట్లాడవలసి వచ్చింది. మొదటినుంచీ ఆయన అడుగుజాడలలో మసులుతూ వచ్చినదాన్ని ఒక్కసారిగా ఆయనచెప్పినది కాదని ధిక్కరింపవలసి వచ్చింది. ఆయనకి కోపం రావడం ఆశ్చర్యమేముంది? నేనుమాత్రం ఏంచేయను? చూస్తూచూస్తూ పిల్ల గొంతుక్కు ఉరిపోయనా? ఇంకోటి ఇంకోటి కనకనా? యావజ్జీవం అనుభవించమని ఆ ఖైదులోకి పిల్లని ఎలా తోయను? పోనీ అదీ జడ్డిదైతే ఆమొగుడితో సరిపుచ్చుకుంటుంది అనుకోడానికి వీలుందికాని మాపిల్ల తెలివైన వాళ్ళకి కూడా తెలివైనది. అనిపించుకుంచే పాట పాడిందంటే వినేవాళ్ళని పరవశుల్ని చేస్తూ ఉండేదే ఎరిగిఎరిగి దీన్ని సావిత్రమ్మ కొడుక్కి ఎలాచేయను.

"మాఆయన పట్టుదల మనిషిఅని నాకుతెలుసు కాని, నామీద ఎంతమండిపడ్డా పిల్లమీదేనా కనికారం చూపిస్తారని నేనాశపడ్డాను ఇంతకీ చెల్లెలి కొడుక్కి యివ్వకపోతే పిల్లకి పెళ్ళికాకపోతుందా? ఇంకో సంబంధం తేలేనివారా? పిల్ల యోగక్షేమం వారికిమాత్రం అక్కరలేదా? పిల్లమీద నాకున్నలాంటి ప్రేమే వారికి ఉండదా?

"ఈవిధంగా నాలోనే అనుకుని యీ సంబంధం పల్లకాదని గట్టిపట్టుపట్టి కూర్చున్నాను కాని నా ప్రయత్నంవల్ల యీలాంటి విషమపరిస్థితి ఏర్పడుతుందని నే కలలోకూడా అనుకోలేదు. నా జీవితం ధ్వంసంచేయడమే కాకుండా యిదిపిల్లకికూడా కత్తిపోటు అవుతుందని ఊహించుకోలేకపోయాను.

నాఉద్దేశం నేను మాఆయనతో ఖచ్చితంగా చెప్పడంతోటే ఆయన ఉగ్రులై నన్ను యింటిలో నుంచి బయటకు గెంటివేశారు. ఎంత అల్లరైందనుకున్నారు! నాపిల్లని మావారి చేతులలోంచి విడిపించుకు రావడం ఎంతకష్టమైంది అనుకున్నారు! చివరకి నేనూ నాపిల్లా నిరాధారులమై వీధిని పడ్డాము. ఇదిజరిగి రెండేళ్లు కావస్తూంది. ఆసందర్భంలో మాఆయన చేసినది తప్పని అన్నవాళ్లు ఒక్కరంటే ఒక్కరు లేకపోయారు, ఎరుగున్నవాళ్ళ యిళ్ళకువెళ్ళి నే మొరపెట్టుకుంటే ఒక్కరూ చెవినపెట్టినవారు లేరు. ఇంక ఈవూరిలో ఎలాగుండగలను? ఏదో ఊరంటూ చేరుకోవాలి గనుక పిల్లను తీసుకుని బందరు బండి ఎక్కాను? బందరులో మా పినతండ్రిగారి అబ్బాయి వున్నాడు. వాడి యింటి సమీపంలోనే అప్పటినుంచీ పిల్లానేనూ ఓ అద్దెపంచని రోజులు త్రోసిపుచ్చుతున్నాం. ఒకటొకటీ నా ఒంటిమీద వస్తువులు అమ్ముకుని జీవిస్తున్నాం.

మా ఆయన మరలా పెళ్ళి చేసుకున్నారని విన్నాను. మా పినతండ్రిగారి అబ్బాయి నాకూ పిల్లకూ మాఆయన భరణం యివ్వనక్కరలేదా అని ఓ ప్లీడర్ని సలహా చేస్తే మాఆయన రెండో పెళ్లి చేసుకున్నా నేనూపిల్లా వెళ్ళి ఆయనయింట్లో పడివుండాలని వేరే నేను కాపురం పెట్టడానికి 'లా' ఒప్పదనీ ఆయన చెప్పారట. హిందూ ధర్మశాస్త్రంలో అలా ఉందట! ఏం హిందూ మతమో, ఏం ధర్మశాస్త్రమో ఇహ మాకులం వాళ్లు నన్ను ఆనిపోస్తున్న మాటలు యిన్నీఅన్నీ కావనుకోండి'!

కాస్సేపటికి కళ్ళనీళ్లు తుడుచుకుని ఆవిడ యీ క్రింది విధంగా చెప్పిందట.

"నారోజులు ఎలాగో ఓలాగు వెళ్ళిపోతాయి. నేను ఆయనకి అక్కరలేనప్పుడు నేను మాత్రం ఆయనకోసం ఎందుకు ప్రాకులాడాలి? కాని, అక్కగారూ, నా పిల్లసంగతి ఏంకాను? ఎప్పటికేనా దీన్ని ఓ అయ్య చేతులలో పెట్టాలా? రేపు వైశాఖమాసానికి దానికి పద్నాలుగేళ్ళు వెళ్ళి వదిహేనేళ్లు వస్తాయి దాన్ని యెంతకాలం నా దగ్గర ఉంచుకోను? ఈమధ్య మా పినతండ్రిగారి అబ్బాయి ఓసంబంధం వెతికి తీసుకొచ్చాడు. అన్నీ అనుకూలంగానే ఉన్నాయి. అమ్మాయికి వివాహయోగం దగ్గరపడింది కాబోలును అని నే సంబరపడ్డాను కాని నే మాఆయనను వదలేసి వచ్చానట. అందుచేత వాళ్లకి నాకూతుర్ని చేసుకోడానికి భయంగా ఉందట. నేను మా ఆయన్ని వదలేసి వచ్చానా చెప్పండి, అక్కగారూ యెవరితో చెప్పుకుంటే మాకు న్యాయం దొరుకుతుందండి? లేకపోతే, యీ సంఘనియమాలకి అణగి యీ జగన్నాధస్వామి రథచక్రాలక్రింద మేం నలిగి చావవలసిందే?"

